# సమయమే పెట్టుబడి

- ఇంటి దగ్గరే పని..
  చేతి నిండా మనీ
- సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజర్లకు
  భలే గిరాకీ



న్యూస్‌టుడే, హిమాయత్‌నగర్

**కంప్యూటర్ ఉద్యోగాలంటే... సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ కంపెనీల్లో పని చేయడమే కాదు... ఇంటి దగ్గర ఉండి కూడా అంతే మొత్తంలో.. చెప్పాలంటే ఇంకాస్త ఎక్కువే సంపాదించొచ్చు. పెట్టుబడి కూడా చాలా తక్కువ. కొద్దిగ ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ, చాకచక్యంగా వ్యవహరిస్తే చాలు... కాసుల పంట పండినట్లే. వారెవరో కాదు... సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజర్లు (ఎస్ఈవో). ఇంతకీ వీరు చేసే పనేంటో తెలుసా... నెట్‌లో సెర్చి చేసినపుడు పలు సంస్థల వెబ్‌సైట్లను తొలి స్థానాల్లో ఉండేలా చేయడమే. నగరంలో ఇప్పుడు వేల మంది ఈ రంగంలో రాణిస్తున్నారు. పనిని బట్టి నెలసరి సంపాదన ఆరు అంకెలు కూడా దాటుతోందట.**

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్‌కు సంక్షిప్త పదం ఎస్ఈవో. బ్యాంకింగ్ సేవలు అందించే రమేష్ ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. కానీ దానికి ఎలాంటి ప్రచారం, గుర్తింపు లేకపోయింది. దీంతో ఓ స్నేహితుడిచ్చిన సలహాతో నిపుణుడైన ఎస్ఈవోను సంప్రదించాడు. వెబ్‌సైట్ ద్వారా లభించిన ప్రచారం, అందించిన సేవల కారణంగా నెల రోజులకే అతని వ్యాపారం పెరిగింది. ఇప్పుడు ప్రతి వృత్తిలోనూ కంప్యూటర్, ఇంటర్నెట్ వాడకం సాధారణమైంది. వెబ్‌సైట్ల సంఖ్య కూడా కోట్లకు చేరింది. ఒక్కో అంశంలో ఎన్నో లక్షల సైట్లు ఉంటున్నాయి. వ్యాపారాభివృద్ధికి సైట్లను ప్రారంభించిన సంస్థలు వాటి నుంచి సరైన ఫలితాలను పొందలేకపోతున్నాయి. దీంతో తమ సైట్లకు ప్రాధాన్యం వచ్చేలా చూడమని ఎస్ఈవోలను ఆశ్రయిస్తున్నారు. అందుకు తగ్గట్లు కోరిన మొత్తాలను చెల్లించేందుకూ వెనకాడ్డంలేదు.

## ఎలా చేస్తారంటే..

తమను సంప్రదించిన కస్టమర్ల పోర్టళ్ల సమాచారాన్ని తీసుకొని, సెర్చ్ ఇంజిన్లకు (గూగుల్, యాహూ, ఎంఎస్ఎన్ లాంటివి) సంకేతాలు ఇస్తారు. వెబ్ డైరెక్టరీలకు పంపుతారు. అలాగే సైట్‌లోని సమాచారాన్ని ఎప్పటికప్పుడు మారుస్తూ, తాజా అంశాలను చేరుస్తుంటారు. తమ ఇతర కస్టమర్ల సైట్లకు అనుసంధానం చేస్తారు. మెటా ట్యాగ్‌లలో సైట్‌ల ప్రాముఖ్యాన్ని వివరిస్తారు. సైట్‌కు ట్రాఫిక్‌ను పంపడం ద్వారా దానికి ప్రాచుర్యం కల్పిస్తారు. వెబ్‌లో సమాచారం వెతికే సమయంలో ఈ సైట్లకు తొలి పేజీలోనే స్థానం ఉండేలా కృషి చేస్తున్నారు. అందుకే భారీ స్థాయిలో పారితోషికం పొందగలుగుతున్నామని చెప్పాడు నగరానికి చెందిన అమిత్‌పటేల్. ప్రస్తుతం ఇతను మూడు వందలకుపైగా సైట్ల బాధ్యతను పర్యవేక్షిస్తున్నాడు.

## వివరాలివీ...

వెబ్‌సైట్లను తొలి స్థానంలో నిలుపుకోడానికి ఈ తరహా ఆప్టిమైజర్ల సేవలు అవసరమే. ఈ తరహా ఆప్టిమైజర్లు మంచి ఆఫర్లు కూడా ఇస్తున్నారు. ఈ సేవలందించే పలు సంస్థలు దినపత్రికల్లో తరచూ ప్రకటనలు సైతం ఇస్తున్నాయి.

www.amithbhavani.com
www.seotips.vhyd.com, www.gii.in